

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 13-04-2026 | సంపుటి - 27 | సంచిక -321 | రూ : 4 | పేజీలు: 8




## శ్రీవారి భక్తులకు గమనిక.. జులై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల

- ఏప్రిల్ 18 నుంచి పలు తేదీల్లో ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్
- ఏప్రిల్ 24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు
- గదుల కోటాను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్న టీటీడీ

2లో

### 40 ఏళ్లు నిండిన కార్మికులకు

# ఉచితంగా వైద్య పరీక్షలు

- ఈఎస్ఐసీ నిర్ణయం
- సనత్‌నగర్ వైద్య కళాశాలలో ఏర్పాట్లు

హైదరాబాద్: రాష్ట్రంలో బీమా వైద్యసేవల (ఈఎస్ఐ) పరిధిలోకి వచ్చే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఉచితంగా.. ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని కార్మికరాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) నిర్ణయించింది. 40 ఏళ్ల వయసు నిండిన వారికి ఏడాదికోసారి 'ఈఎస్ఐసీ వార్షిక ముందస్తు ఆరోగ్య పరీక్షల' పేరిట సనత్‌నగర్ వైద్య కళాశాలలో అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈఎస్ఐసీ తెలిపింది. తదుపరి చికిత్సలు అవసరమైతే సిఫారసు చేయడంతోపాటు ఉచితంగా ఔషధాలు పంపిణీ చేస్తామని పేర్కొంది. ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికులను వైద్య శిబిరాలకు పంపించాలని పరిశ్రమలు, సంస్థల యాజమాన్యాలను కోరింది. రోజుకు కొందరు చొప్పున (ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకి 10 మంది) అందరికీ వైద్య పరీక్షలు చేయించాలని సూచించింది. తరువాయి 2లో





### భారత్-పాక్

## యుద్ధాన్ని ఆపాను

- అమెరికా-ఇరాన్ మధ్య విఫలమైన ఉన్నత స్థాయి శాంతి చర్చలు
- కీలకమైన హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని సంచలన ప్రకటన
- అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని స్పష్టం చేసిన ట్రంప్

2లో





## అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల.. 57 రోజుల పాటు యాత్ర

2లో

- ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభం
- మొత్తం 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర
- రక్షాబంధన్ రోజున ఆగస్టు 28న యాత్ర ముగింపు
- ఈ నెల 15 నుంచి యాత్ర కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

### విజయ్‌పై డీఎంకే

## 'వర్క్ ఫ్రమ్ హోమ్' సెటైర్లు!

- ఎన్నికల ప్రచార సభలను రద్దు చేసుకున్న విజయ్
- అధినేత నిర్ణయంతో తమిళగ వెట్రి కళగం శ్రేణుల్లో కొంత గందరగోళం
- డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రచారం కొనసాగిస్తామని పార్టీ ప్రకటన

2లో





### తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల..

## అమ్మాయిలదే హవా!

- తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు 2026 విడుదల
- ఫస్టియర్‌లో 66.20%, సెకండియర్‌లో 70.58% మంది ఉత్తీర్ణత
- ఫలితాల్లో మరోసారి సత్తా చాటిన అమ్మాయిలు
- అధికారిక వెబ్‌సైట్లతో పాటు వాట్సాప్ ద్వారా కూడా ఫలితాల వెల్లడి
- ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

2లో

### రాష్ట్రంలో కాంగ్రెస్

## 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది

- సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్
- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు
- సింగరేణిలో అవినీతి ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపై అగ్గిపుట్టిస్తామని హెచ్చరిక
- సింగరేణి కుంభకోణంపై కేంద్రం విచారణ జరపడం లేదని ఆగ్రహం



2లో

# భారత్-పాక్ యుద్ధాన్ని ఆపాను

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 : భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన పూర్తిస్థాయి యుద్ధాన్ని తాను ఆపడం వల్లే దాదాపు 5 కోట్ల మంది ప్రాణాలు నిలిచాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ (SOTU 2026)' ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తూ, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో తన పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. పాకిస్థాన్ నాయకులు తనకు నిరంతరం కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు. గతేడాది (2025) కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది భారతీయులు మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరి, అణు యుద్ధం ముంగిట నిలిచాయని ట్రంప్ వివరించారు. ఆ క్లిష్ట సమయంలో తాను జోక్యం చేసుకోకపోతే పెను విధ్వంసం జరిగి ఉండేదని అన్నారు. "భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరిగి ఉండేది. దానివల్ల 3 నుంచి 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారు. 'మీరు లేకపోతే నేను సహా 3.5 కోట్ల మంది చనిపోయేవారు' అని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాతో చెప్పారు" అని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తన మొదటి 10 నెలల పాలనలోనే భారత్‌పాక్ ఘర్షణ సహా 8 యుద్ధాలను అంతం చేశానని గుర్తుచేశారు. ఆ ఘర్షణ సమయంలో 11 ఖరీదైన యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా ప్రస్తావించారు. పాక్ ప్రధాని తన చీఫ్ ఆఫ్ స్టాఫ్ ముందే తనకు బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారని ట్రంప్ ఉదహరించారు. అయితే, ట్రంప్ వాదనలను భారత్ గతంలోనే తోసిపుచ్చింది. భారత్‌పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా ద్వైపాక్షిక చర్చల ద్వారానే జరిగిందని, ఇందులో ఎలాంటి మూడో పక్షం జోక్యం లేదని భారత విదేశాంగ శాఖ పలుమార్లు స్పష్టం చేసింది.

## విజయ్‌పై డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్' సెటైర్లు!

చెన్నై, ఏప్రిల్ 12 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న తరుణంలో, నటుడు, తమిళగ వెట్రి కజగం(టీవీకే) అధినేత విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ఖరారైన పలు బహిరంగ సభలను ఆయన అకస్మాత్తుగా రద్దు చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై అధికార డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్' రాజకీయమంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన కీలకమైన ర్యాలీలు, సభలను విజయ్ రద్దు చేస్తున్నట్టు టీవీకే వర్గాలు తెలిపాయి. అయితే, ఈ నిర్ణయానికి కచ్చితమైన కారణాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ప్రచార వ్యూహంలో మార్పులు చేయడం లేదా భద్రతాపరమైన అంశాలు దీనికి కారణమై ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ నిర్ణయంపై అధికార డీఎంకే పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఎన్నికల సమయంలో ప్రజల మధ్య ఉండాల్సింది పోయి, ఇలా సభలు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించింది. విజయ్ క్షేత్రస్థాయిలో తిరగకుండా 'వర్క్ ఫ్రమ్ హోమ్' పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు, అధినేత పర్యటనలు ఆగిపోవడంతో టీవీకే కార్యకర్తలు, అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. అయితే, విజయ్ సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరువవుతారని పార్టీ నాయకులు చెబుతున్నారు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు పోటీగా తమిళనాడులో మూడో ప్రత్యామ్నాయంగా నిలవాలని టీవీకే లక్ష్యంగా పెట్టుకుంది. ఇలాంటి కీలక సమయంలో విజయ్ ప్రచార సభలను రద్దు చేసుకోవడం ఆయన వ్యూహంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకోదాచుకో' పథకం నడిపిస్తోంది

హైదరాబాద్, ఏప్రిల్ 12 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకోదాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది," అని కేటీఆర్ విమర్శించారు. సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, అవినీతిని ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపైనా అగ్గిపుట్టిస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని, పోలీసులతో భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగని తమ పార్టీ కౌన్సిలర్లను అభినందించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో తెలంగాణపై భస్మాసుర హస్తం పెట్టిందని కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల.. 57 రోజుల పాటు యాత్ర

అమర్‌నాథ్, ఏప్రిల్ 12: పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్‌ను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది యాత్ర జులై 3న ప్రారంభమై, 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినం రోజున ముగుస్తుందని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వివరాలను పంచుకుంది. షెడ్యూల్ ప్రకారం యాత్ర ప్రారంభానికి ముందు జూన్ 29న జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా శివుని ఆశీస్సులు కోరుతూ 'ప్రథమ పూజ' నిర్వహిస్తారు. యాత్ర కోసం ఈ నెల 15 నుంచి అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని లెఫ్టినెంట్ గవర్నర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న జమ్మూకశ్మీర్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్‌బీఐ, యస్ బ్యాంక్‌లకు చెందిన 554 బ్రాంచుల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ గుహలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఇక్కడ సహజసిద్ధంగా ఏర్పడే మంచు లింగాన్ని శివుని స్వరూపంగా భక్తులు విశ్వసిస్తారు. భక్తులు రెండు మార్గాల ద్వారా ఈ యాత్రను పూర్తి చేసుకోవచ్చు. ఒకటి సాంప్రదాయ పహల్గామ్ మార్గం కాగా, మరొకటి బల్తాల్ మార్గం. పహల్గామ్ మార్గంలో 34 కిలోమీటర్ల ట్రెక్కింగ్ ఉంటుంది, దీనికి 35 రోజులు పడుతుంది. బల్తాల్ మార్గం 14 కిలోమీటర్లు మాత్రమే ఉండి, యాత్ర పూర్తి చేసి అదే రోజు బేస్ క్యాంప్‌కు తిరిగి రావచ్చు. ఈ రెండు మార్గాల నుంచి హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల.. అమ్మాయిలదే హవా!

హైదరాబాద్, ఏప్రిల్ 12: లక్షలాది మంది విద్యార్థుల ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ వార్షిక పరీక్షల ఫలితాలు 2026 విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 70.58 శాతం మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించి తమ సత్తా చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అనంతరం మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ మధ్య 20 కేంద్రాల్లో సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియను రికార్డు సమయంలో పూర్తి చేసి, వేగంగా ఫలితాలను సిద్ధం చేశారు.

**వెబ్‌సైట్లు, వాట్సాప్‌లోనూ ఫలితాలు**


విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు ఇంటర్ బోర్డు పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. అధికారిక వెబ్‌సైట్లయిన `tgbie.cgg.gov.in`, `results.cgg.gov.in`లను సందర్శించి, తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు. `8096958096` నంబర్‌కు వాట్సాప్‌లో 'Hi' అని మెసేజ్ పంపి, సూచనలను అనుసరించి హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే వెంటనే ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. అక్కడే మార్కుల షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

**మే నెలలో సప్లిమెంటరీ పరీక్షలు**

వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు. వీటి ఫలితాలను కూడా అదే నెల చివరికల్లా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.

## సాంకేతిక విప్లవం 14న క్వాంటం కంప్యూటర్ ప్రారంభం

అమరావతి, ఏప్రిల్ 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో ఒక చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. భారతదేశంలోనే మొట్టమొదటి దేశీయ, ఓపెన్‌యాక్సెస్ క్వాంటం కంప్యూటర్లను అమరావతిలో ఆవిష్కరించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కీలక వివరాలు పంచుకున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'అమరావతి 1S', 'అమరావతి 1Q' పేరుతో ఈ క్వాంటం కంప్యూటర్లను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా, ఒక గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. "భారత్‌లో తయారై, భారతీయులకు అందుబాటులో ఉంటూ, ప్రపంచానికి సేవలు అందించడమే" తమ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ పరిణామంతో దేశ క్వాంటం భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని, భవిష్యత్ టెక్నాలజీ అమరావతి నుంచే మొదలవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం కంప్యూటింగ్ రంగంలో ఏపీ కీలక పాత్ర పోషించనుంది.



## శ్రీవారి భక్తులకు గమనిక... జులై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల

తిరుమల : తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026 జులై నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటా విడుదల తేదీలను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకునేందుకు వీలుగా, ఏప్రిల్ 18 నుంచి దశలవారీగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

* **విడుదలయ్యే టికెట్లు, తేదీల వారీగా వివరాలు:**

ఏప్రిల్ 18: ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భక్తులు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

ఏప్రిల్ 21: ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను భక్తులు నేరుగా బుక్ చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు.

ఏప్రిల్ 23: ఈ రోజు మూడు వేర్వేరు సమయాల్లో టోకెన్లు విడుదలవుతాయి.

ఉదయం 10 గంటలకు: అంగప్రదక్షిణ టోకెన్లు.

ఉదయం 11 గంటలకు: శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు.

మధ్యాహ్నం 3 గంటలకు: వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లు.

ఏప్రిల్ 24: భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు.

భక్తులు తమకు కావాల్సిన సేవలు, దర్శన టికెట్లు, గదులను కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ అయిన ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరాలను టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## 40 ఏళ్లు నిండిన కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు




హైదరాబాద్: రాష్ట్రంలో బీమా వైద్యసేవల (ఈఎస్ఐ) పరిధిలోకి వచ్చే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఉచితంగా.. ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని కార్మికరాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) నిర్ణయించింది. 40 ఏళ్ల వయసు నిండిన వారికి ఏడాదికోసారి 'ఈఎస్ఐసీ వార్షిక ముందస్తు ఆరోగ్య పరీక్షల' పేరిట సనత్‌నగర్ వైద్య కళాశాలలో అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈఎస్ఐసీ తెలిపింది. తదుపరి చికిత్సలు అవసరమైతే సిఫారసు చేయడంతోపాటు ఉచితంగా ఔషధాలు పంపిణీ చేస్తామని పేర్కొంది. ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికులను వైద్య శిబిరాలకు పంపించాలని పరిశ్రమలు, సంస్థల యాజమాన్యాలను కోరింది. రోజుకు కొందరు చొప్పున (ఒక్కో పరిశ్రమ నుంచి రోజుకి 10 మంది) అందరికీ వైద్య పరీక్షలు చేయించాలని సూచించింది.

**18.9 లక్షల మంది కార్మికులు...**

'రాష్ట్రంలో బీమా వైద్య సేవల పరిధిలోకి వచ్చే కార్మికులు దాదాపు 18.9 లక్షల వరకు ఉన్నారు. వీరిలో మహిళా కార్మికుల వాటా 4.9 లక్షలుగా ఉంది. వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న వారు అక్కడి పని పరిస్థితులు, ఇతర కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. ఏటా ఈఎస్ఐసీకి వైద్యం కోసం వస్తున్న వారిలో రక్తపోటు, మధుమేహం, కిడ్నీ ఇతర వ్యాధులతో వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడంతో ఆయా వ్యాధులు ముదిరిన తరువాత వైద్యానికి వస్తున్నారు. ఈ పరిస్థితి నివారించేందుకు కేంద్ర కార్మిక శాఖ 40 ఏళ్ల వయసు పైబడిన కార్మికులకు ఏటా ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలనే పథకాన్ని తీసుకువచ్చింది. పరీక్షల కోసం కార్మికులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు. వైద్య పరీక్షల అనంతరం చికిత్సకు అవసరమయ్యే ఔషధాలు ఉచితంగా లభిస్తాయి. అత్యవసరమైతే అక్కడే చేర్చుకుని చికిత్స ప్రారంభిస్తారు' అని ఈఎస్ఐసీ వెల్లడించింది.

**ఎక్కడ... ఎప్పుడు...?**

సమయం : ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు

ప్రదేశం : సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఓపీడీ భవనం

**నిర్వహించే పరీక్షలివీ...**

సీబీపీ, చెస్ట్ ఎక్స్‌రే, ఎలక్ట్రోకార్డియోగ్రాం (ఈసీజీ), ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్ఏ), మధుమేహ పరీక్షలు, కిడ్నీ పనితీరు పరీక్షలు (ఆర్ఎఫ్‌టీ), కాలేయ పనితీరు పరీక్ష (ఎల్ఎఫ్‌టీ), సమగ్ర మూత్ర పరీక్ష

# 991 మార్కులు సాధించిన గురుకుల విద్యార్థిని సాత్విక



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఖమ్మం జిల్లా వైరాలోని ప్రభుత్వ గురుకుల కళాశాలలో బైపిసి చదివిన కొత్తగూడెంకు చెందిన సాత్విక ఆదివారం ప్రకటించిన ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాల్లో 991 మార్కులు సాధించింది. సాత్విక తండ్రి సంతోష్ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూనే మరోవైపు ప్రాణధార ట్రస్ట్ స్థాపించి పాములను పట్టడం, అనాథలకు సహాయ సహకారాలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గురుకుల కళాశాలలో చదివి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన సాత్వికను కళాశాల అధ్యాపకులతోపాటు కొత్తగూడెంకు చెందిన పలువురు అభినందించారు.


# ప్రజావాణికి సకాలంలో హాజరు కావాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రైలు ప్రమాదంలో మహిళ మృతి



ప్రజా స్ఫూర్తి , షాద్నగర్ : రైలు తగిలి ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. షాద్‌నగర్‌లోని రామ్‌నగర్ కాలనీకి చెందిన మునావత్ గోరి (56) ఆదివారం సాయంత్రం సుమారు 4:35 గంటల సమయంలో కూరగాయలు కొనుగోలు చేయడానికి బయలుదేరారు. ఈ క్రమంలో రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా, ప్రమాదవశాత్తు రైల్వే ట్రాక్ మిషన్ తగిలి ఆమె అక్కడికక్కడే మరణించారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఢిల్లీ మల్లేశ్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మొక్క నాటి వనజీవి రామయ్యకు నివాళి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వనజీవి రామయ్య వర్ధంతి సందర్భంగా ప్రకృతి హరితదీక్షకురాలు నైనిక రజువా మొక్క నాటి నివాళి అర్పించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం, సాయిబాబా మందిరంలో ఆదివారం వనజీవి రామయ్య వర్ధంతి సందర్భంగా చిన్నారులు అనన్య, శాన్వి, వైశాలి, జాను, చిన్నుతో కలిసి మొక్క నాటి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నైనిక మాట్లాడుతూ వనజీవి రామయ్యను స్ఫూర్తిగా తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అలాగే ''అమ్మ పేరుతో ఒక మొక్క'' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



R. JYOTHIKA
I - BIPC (438)



B. KAVERI
I - MPC (468)



V. PRANAVIKA
II - BIPC (993)



K. HASINI
I - MPC (468)



SRI CHARAN
II - MPC (992)



J. ANUSHA
II - MPC (992)

# రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన గౌతమి కాలేజీ విద్యార్థులు

నల్లగొండ , ప్రజాస్ఫూర్తి : ఆదివారం ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో పట్టణంలోని గౌతమి కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు వన్నెతెచ్చారు,ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో కే సుదీక్ష 468 కే హాసిని 468 బుర్రి కావేరి 468 జుహా నూరిన్ 467 నలహిదా తన్వీర్ 467 కే హరిన 467 ఎం ప్రసన్న 467 పి రమ్య 467 డి ప్రవళిక 467 ఏ వర్షా 467 ఎం శివాని 467 యశ్వంత్ రెడ్డి 467 బైపిసి విభాగంలో ఆర్ జ్యోతిక 438 డి రేష్మ దేవి 437 ప్రసన్న 437 గాయత్రి 437 కె హనీషా 437 ఏ స్పందన 437 ద్వితీయ సంవత్సరం విభాగంలో ఎంపీపీలో కె అనూష 992 పి శ్రీ చరణ్ 992 ఎన్ తేజస్విని 991 కే అనుష్క 991 డి స్పందన 991 అర్జున్ 91 పవన్ కుమార్ రెడ్డి 991 ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో వి ప్రణవిక 993 992 సుమమా చీరన్ 992 కే సాత్విక 992 కే దీక్షిత 992 ఎస్ నికిత 992 ఎస్ సతీష్ కుమార్ 991 వంటి వరుస మార్కులతో గౌతమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకటరెడ్డి చెల్లా వెంకటరమణ కొమ్మిడి రఘుపాల్ రెడ్డి పుట్టా వెంకటరమణారెడ్డిలో అభినందించారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో భాషిత జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా

* **రికార్డు స్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించిన బాషిత జూనియర్ కళాశాల**









జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐడిపియల్ క్రాస్ రోడ్స్‌లోని భాషిత జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. విద్యా రంగంలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, స్థాపించిన తొలి ఏడాదే అనుభవజ్ఞులైన సంస్థలకు దీటుగా విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్ర ఇంటర్మీడియట్ ఫలితాల్లో రికార్డు స్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించింది. ఎం.పి.సి విభాగంలో ప్రియ కేతన సాయి, ఎం. హన్విక్ 464/470 మార్కులతో స్టేట్ టాపర్లుగా నిలవగా, శిల్పిత హిమాని (463), షేక్ దియా (462), అను మేఘన రెడ్డి (461), చార్విక్ (461) అత్యుత్తమ మార్కులు సాధించారు. బై.పి.సి విభాగంలోనూ దీపికా రాజ్ (433/440), విజయ్ చౌదరి (431), బాలాజీ (428) మార్కులతో తమ మేధస్సును చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఛైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ, కరస్పాండెంట్ తాటిచర్ల శైలజ, డైరెక్టర్ టి. హేమలత పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. స్టేట్ ర్యాంకులు సాధించిన టాపర్స్ తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. తమ పిల్లల విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో విలువైనదని యాజమాన్యం ఈ సందర్భంగా పేర్కొంది. కేవలం అకడమిక్ మార్కులే కాకుండా ఐఐటీ జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడమే భాషిత లక్ష్యమని డైరెక్టర్ టి. హేమలత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు , సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని జరుపుకున్నారు.

# జనాభా లెక్కల సర్వే పేరుతో దొంగతనాలు

* **నకిలీ సర్వేల పట్ల మోసపోవద్దు**
* **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
* **ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్. గణేష్**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: జనాభా లెక్కల సర్వే పేరుతో దొంగతనాలు జరుగుతున్నాయని ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్.గణేష్ సూచించారు. ఆదివారం ఎస్.ఐ సిహెచ్.గణేష్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా బోధన్‌లో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తుల గుంపుగా ఏర్పడి తాము ప్రభుత్వ అధికారులమని, జనాభా లెక్కల (సెన్సస్) సర్వే నిర్వహిస్తున్నామని చెప్పుకుంటూ ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. నీళ్లు కావాలని చెప్పి ఇంట్లోకి ప్రవేశించి, ఆమె చేతులు, కాళ్లు కట్టేసి సుమారు 5 తులాల బంగారం, 68 తులాల వెండి ఆభరణాలను దోచుకున్నారని వివరించారు. ప్రస్తుతం ఎలాంటి అధికారిక జనాభా లెక్కల సర్వే జరగడం లేదని ఎస్.ఐ సిహెచ్.గణేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులమని చెప్పుకునే వ్యక్తులను సరైన ఐడి కార్డులు పరిశీలించిన తరువాత మాత్రమే ఇంట్లోకి అనుమతించాలని సూచించారు. మండలంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 లేదా 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజలకు ఎస్.ఐ సిహెచ్.గణేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.









# ఇంటర్ ఫలితాల్లో ప్రగతి ప్రభంజనం

నల్లగొండ ,ప్రజాస్ఫూర్తి : ఆదివారం ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాలలో పట్టణంలోని ప్రగతి కాలేజీ ప్రభంజనం సృష్టించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను పిచన్విత 994 ఎం శ్రీవల్లి 994 ఎం శ్రీ సాయి తులసి 993 ఎం శృతి 993 ఎస్ దుర్గాభవాని 993 ఎస్ మునిదీప్ 993 బి రవిత్రనేని 993 బి కాంచన 993 ఇదేవిధంగా 26 మంది విద్యార్థులు 991 మార్కులు 30 మంది విద్యార్థులు 990 మార్కులు సాధించారు బైపిసి విభాగంలో శివాని 993 ఎం అక్షిత 991 సాధించారు అలాగే మొదటి సంవత్సరంలో ఎంపీ సీబీ భాగంలో 470 మార్కులకు గాను సిహెచ్ హరీష్ 468 ఎం చరణ్ 468 ఆర్ శృతి 468 పి శ్రీనిధి 428 బి చరణ్ 468 ఈ గీతిక 468 ఎం కీర్తి 468 మేఘన 468 స్నేహ 468 తేజశ్రీ 468 భవాని 468 మార్కులతో రాక్షస్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిచారు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి డైరెక్టర్లు నరేందర్ బాబు శశిధర్ రావు చందా శ్రీనివాస్ పైల రమేష్ రెడ్డి అధ్యాపక బృందం అభినందించారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై మంత్రి పొన్నం ఫోకస్

* **పనులలో జాప్యం చేయొద్దు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిపై మంత్రి పున్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు ఆదివారం స్థానిక నాయకులతో అధికారులతో కలిసి సుందరీకరణ పనులను పరిశీలించారు. పల్లె చెరువు కట్ట సుందరీకరణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు.హుస్నాబాద్ పట్టణ డ్రైన్ వాటర్ కొత్త చెరువు లో కలవకుండా నేరుగా ప్రత్యేక ఫీడర్ కి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.అనంతరం ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పరిశీలించారు.కట్ట సుందరీకరణ డెవలప్మెంట్ జరుగుతున్న పనులపై ఆరా తీశారు.పనుల్లో నాణ్యత ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులో నిర్మితమవుతున్న గ్లాస్ బ్రిడ్జి పనులు పరిశీలించారు. కట్టపైన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని,కట్టపైన ఉన్న గుట్టపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో భక్తుల సదుపాయాల కోసం నిర్మిస్తున్న నూతన షెడ్డులను ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మితమవుతున్న పోచమ్మ ఆలయాన్ని పరిశీలించారు. హుస్నాబాద్ 8,9 వ వార్డు కి సంబంధించి శ్మశాన వాటిక కు స్థల పరిశీలన చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,మున్సిపల్ కౌన్సిలర్లు వరప్రసాద్ .ఆర్డీవో మున్సిపల్ కమిషనర్ ఇతర ముఖ్య నేతలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం పోస్తే కఠిన చర్యలు.. ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వద్దు

* **ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ హెచ్చరిక**





ప్రజాస్ఫూర్తి ,ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిధిలోని ప్రధాన రహదారులపై ధాన్యం పోసి ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రైతులు రోడ్లపై ధాన్యం పోయవద్దని ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ సూచించారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ధాన్యం పోయడం వల్ల రహదారి ఇరుకుగా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లో లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద మాత్రమే ఆరబెట్టుకోవాలని కోరారు. రాత్రి సమయాల్లో రహదారులపై ధాన్యం కుప్పలు సరిగ్గా కనిపించక వాహనదారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. నిబంధనలు అతిక్రమించి రహదారులపై ధాన్యం పోసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు పోలీసులకు సహకరించి రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండి తక్కువ వేగంతో ప్రయాణించాలని సూచించారు.

# బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

* **జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**





ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట : వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.ఆదివారం డివిజన్ పరిధి సంజయ్ పురి కాలనీ చౌరస్తాలో మహిళా సంఘం నాయకురాలు జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన దాతలను ఆయన అభినందించారు. దాతలు సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని అందుకు తన సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. చలివేంద్రాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు సుదగాని మల్లేష్ గౌడ్,యువజన విభాగం నాయకులు కొలుకుల జైహింద్,స్థానిక సంక్షేమ సంఘం నాయకులు అప్పల శ్రీను,అరుణ్ రెడ్డి,కిషోర్,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎస్ఆర్ నల్లగొండ పీజేసీ బ్రాంచ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించారు. ఎంపీసి ఫస్ట్ ఇయర్ లో జీలకుంట్ల నమిక ఆకవరం శివాని విద్యార్థినులు 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి రాష్ట్ర ర్యాంకు సాధించారు. అదే విధంగా కొలగట్ల నవనీత కు 466, శీలం నిశాంత్ కు 465, శ్రీ చరణ్ కు 465, కొప్పు కృత్యకు 465, జోగు మధు కిషోర్ ) 465 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. అదే విధంగా బైపిసి 1st ఇయర్ లో పసుపులేటి కిర్తన 440 మార్కులకి గాను 437 మార్కులు సాధించి స్టేట్ అత్యుత్తమ ర్యాంకు సాధించింది. అదే విధంగా కన్నెకంటి శ్రీనిధి 436, వేముల వికాస్కి 434, మేక సౌమ్య 432 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను నర్సింగ్ సాయి కిరణ్ 995 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించారు. అలకుంట్ల అనూష )కు 994, ఎంపీసీ విభాగంలో ఎర్ర మాద జ్ఞానేశ్వర్ 992 మార్కులు సాధించాడు. వీరమళ్ళ రమ్య (2650205302)991, కాసర్ల శ్వేతకు 990, గంధమల్ల విష్ణు వర్ధన్988, పువటి సాయి ప్రతాప్ 987 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను ఎస్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి సీఈఓ సురేందర్ రెడ్డి, ఎకడమిక్ డీన్ భరత్ రెడ్డి నల్లగొండ జోనల్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి అధ్యాపకులు అభినందించారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు



నల్లగొండ ఉమ్మడి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఇంటర్ ఫలితాలలో నల్గొండ పట్టణానికి చెందిన శ్రీ వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలోఏం దివ్యా 993, బి .మీనాక్షి 981, సెకండ్ ఇయర్ బైపిసి విభాగంలో ఎం రేణుక 980,టి. వైష్ణవి 977, ఇంటర్ ధర్మ సంవత్సరం ఎంపీసీ విభాగంలోపి. క్రాంతి శ్రీ 465,ఎం .శివాని 464,పి. ప్రణీత 461, ప్రథమ సంవత్సరం బైపిసి విభాగంలోకే .నవ్య 430,డి .నమీ నిరూపమా నా 427 మార్కులు సాధించారు అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ తోట శ్రీనివాసరావు ఆధ్యాత్మిక బృందం రఘు సైదులు కృష్ణ రాంబాబు రామలింగయ్య సన్మానించారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి విచ్చేసిన అధ్యాపక బృందానికి విద్యార్థులకు సహకరించిన తల్లిదండ్రులకు యాజమాన్యం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టును పరామర్శించిన డిపిఆర్ఓ పసునూరి రాజేంద్రప్రసాద్



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు బిఆర్కె న్యూస్ ప్రతినిధి దురుసోజు వీరాంజనేయులు, ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం తొర్రూరు పట్టణంలో వీరాంజనేయులు స్వగృహంలో మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్, పరమశించి ప్రమాదానికి గల కారణాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు,మహబూబాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, ఎస్పీ డాక్టర్ శబరీష్, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం పై ప్రత్యేక చర్యలు తీసుకొని మండల వారీగా కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.వార్తల సేకరణలో వివిధ ప్రదేశాలకు వెళ్ళు సమయంలో ప్రింట్ అండ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వెళ్లి వచ్చే క్రమంలో టూవీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్లో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, తగిన జాగ్రత్తలు వహించాలని, వేసవి కాలంలో ఆరోగ్య నియమాలు పాటించాలని ఆయన కోరారు,జర్నలిస్టులు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, కొండ సతీష్,పోల్ రాజు, బజ్జూరి వాసు, కందికొండ కుమార్, పి.బిక్షపతి తదితరులు ఉన్నారు.

# పేదవాడికి సొంత గూడు కల్పించి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటమే లక్ష్యం

*** షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : అర్హులైన ప్రతి పేదవాడికి సొంత గూడు కల్పించి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రజా ప్రభుత్వ అసలు లక్ష్యమని షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నూతనంగా నిర్మించిన మూడు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి సామూహిక గృహప్రవేశాలు చేయించారు. అనంతరం ఇంట్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గతంలో నిలిచిపోయిన పేదల సొంతింటి కలను ఇందిరమ్మ రాజ్యంతోనే సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని, గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు, ప్రస్తుతం ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు.

*** వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్**

స్థానిక కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. 12వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు. వార్డులో ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు చేరేలా క్షేత్రస్థాయిలో పని చేస్తామని, ముఖ్యంగా గృహనిర్మాణం, డ్రైనేజీ, తాగునీరు వంటి కనీస సౌకర్యాల కల్పనలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. నేడు మూడు కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అట్టహాసంగా జరిగిన గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక నేతలు రావడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే అండతో మా వార్డు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.డి. ఇబ్రహీం, కౌన్సిలర్లు పెంటయ్య, ప్రవీణ్ కుమార్, అప్పి, నాయకులు ముబారక్, సీనియర్ కార్యకర్త సత్తయ్య, మల్లేష్, అప్సర్, రమేష్, రాహుల్, జయంత్, మణికంఠ తదితరులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.

## అ'పూర్వ' కలయిక

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:10వ తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు 35 ఏళ్ల తరువాత తిరిగి కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రామవరంలోని హైస్కూల్‌లో ఆదివారం 1989-90 సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆనాటి విద్యార్థులంతా మళ్లీ ఒక్క చోటకు చేరి ప్రభుత్వ పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన వారు ఈ సమ్మేళనంలో పాల్గొని తమకు విద్యనేర్పిన గురువులను తలుచుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సైతం ఈ అపూర్వ కలయికకు వచ్చి చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని వారు తమ మనోభావాలను పంచుకున్నారు. యాదాద్రిజిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఖమ్మం సీఐ బాలాజీ, అప్పటి ఉపాధ్యాయులు రామారావు, వెంకట్ రెడ్డి, మహేశ్వరి ట్యుటోరియల్ ఉపాధ్యాయులు శ్రీరామూర్తి, ప్రస్తుత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భరత్ కుమార్ పాల్గొని తమ మాటల ద్వారా అందరినీ అలరించడంతోపాటు ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సీఐ బాలాజీ, ఉపాధ్యాయులు రామారావు, వెంకట్ రెడ్డి లను ఘనంగా సన్మానించి మొక్కలను అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి



ఖమ్మం జిల్లా /ప్రజాస్ఫూర్తి : పద్మశ్రీ వనజీవి రామయ్య వర్ధంతి సందర్భంగా మున్సిపల్ ఫ్రీడమ్ పార్క్ 53వ డివిజన్ లో డా.కడవెండి వేణుగోపాల్ ప్రముఖ సామాజికవేత్త పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాలుష్యం లేని వాతావరణంగా చేయాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు బొడ్ల నారాయణ రావు , పెద్దినేని కృష్ణమూర్తి , ఎర్రగుంట మధుసూదన్ రావు , మాధవరపు సీతారామచంద్రమూర్తి , ఎడ్ల నాగేశ్వరరావు , ఆర్ జె వెంకటేశ్వర్లు , కంది నాగాచారి , కోట రామకృష్ణ, చిన్నారులు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

## వైభవంగా శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయం షోడశ బ్రహ్మోత్సవాలు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేస్ 2 లోని శ్రీ గంగా లలితా కామేశ్వరి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయం షోడశ 16వ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోరిన కోర్కెలు సిద్ధింప చేసే దైవం సిద్దేశ్వర స్వామి అని, స్వామి వారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త మురళీ, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక

**: బండి సంజయ్**



హైదరాబాద్ : మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలు బుద్ధి చెబుతారన్నారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు దశాబ్దాల నాటి కల అని, మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా బిల్లుకు మద్దతివ్వాలని బండి పిలుపునిచ్చారు. " మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందే. డీలిమిటేషన్‌తో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. తెలంగాణ అసెంబ్లీలో 60 మంది మహిళలకు అవకాశాలు లభిస్తాయి'' అని బండి సంజయ్ అన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే 'నారీశక్తి వందన్ అధినియం' బిల్లును ప్రవేశపెట్టనున్నారు. చట్టాన్ని 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే అమలులోకి తెచ్చేలా చర్యలు చేపట్టనున్నారు.

## న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ ఫిర్యాదు



పంజాగుట్ట: తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ ఫిర్యాదు చేశారు. తన తరఫు న్యాయవాదితో కలిసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆమె.. లిఖిత పూర్వక ఫిర్యాదును పోలీసులకు అందజేశారు. ఇటీవల న్యాయవాది సుబ్బారావు తన కార్యాలయం వద్దకు వచ్చి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకు దుర్భాషలాడుతూ.. మీడియాలో దుష్ప్రచారం చేస్తానని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైక్రోఫైనాన్స్ పేరుతో మంగ్లీ రూ.10 కోట్లు మోసం చేశారని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అడ్వకేట్ సుబ్బారావు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. "న్యాయవాది సుబ్బారావు నాపై దుష్ప్రచారం చేసి, ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారు. ఫైనాన్స్ మోసం కేసుతో నాకు సంబంధం లేదు. నాకు చేతినిండా పని ఉంది.. ప్రజలను మోసం చేసే పని చేయను. బాధితుల తరఫున నేను కూడా పోరాడుతా. నాకు డబ్బు ఆశ లేదు.. పాటలే నా ప్రపంచంగా జీవిస్తున్నా. కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. నా మూలాలు మర్చిపోను. నా తమ్ముడిపై కూడా ఆరోపణలు మోపుతున్నారు.

## రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అరైవ్,అలైవ్2026 ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను జయప్రదం చేయాలి. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్.రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని, ప్రతి పౌరుడు బాధ్యతతో ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. అరైవ్,అలైవ్ 2026 కార్యక్రమాన్ని భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రతి సంవత్సరం నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, అప్రమత్తత వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అభివృద్ధి చేయండి

*** జిల్లలగడ్డలో ఏర్పాటు చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలం పరిధిలో జిల్లలగడ్డ వద్ద అర్బన్ ఫారెస్ట్ పార్క్ పనులను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో జరుగుతున్న పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ కి వివరించిన అటవీశాఖ అధికారులు.ఇప్పటికే అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో మట్టి ట్రాక్ వాటర్ సంపు గజ్బోల్ పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు.పిల్లలను అట్రాక్టివ్ చేసేలా భిన్నమైన క్రీడా సామాగ్రి పెట్టాలని ఆదేశించారు.ఫారెస్ట్ లో గ్రీన్ లేన్ ఏర్పాటు చేయాలని సూచించారు . న్యాచురల్ వాటర్ ఫాల్స్ కి అవకాశం ఉండే వాటిపై దృష్టి సారించాలని న్యాచురల్ గా ఉండే ట్రెక్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుట్టలొద్ది,గాడిద లొద్ది మధ్య లక్నవరం లాంటి కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వరూప ,మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ లు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎంపిక

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: ఎస్సీ ఎస్టీ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం స్థానిక రెంపీ గెస్ట్ హౌస్ లో జరిగిన ఐదవ వార్షికోత్సవ సమావేశంలో ఘనంగా జరుపుకున్నారు,జిల్లా అధ్యక్షులుగా స్వర్ణలత సెక్రటరీగా గూగుల్ శంకర్ నాయక్, కోశాధికారిగా కే మారయాలను, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అంతకుముందు మహనీయుల జయంతి కార్యక్రమం సందర్భంగా మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమానికిముఖ్యఅతిథిగా. చలపతిగిరి. కొడంగల్ యాదయ్య. గోవర్ధన్. నల్గొండ పరిధిలో పోస్ట్మాస్టర్ లు అంకులయ్య. తోడేటి వీర స్వామి ప్రసాద్. అరుణ కుమారి సుదర్శన్.. నాగేష్. గ్రామీణ తపాలా ఉద్యోగుల నాయకులు బెల్లం రామస్వామి రామస్వామి వెంకటయ్య యాదయ్య లక్ష్మీనరసింహ. కే కవిత తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన స్ఫూర్తి

*** విద్యార్థినిని అభినందించిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోగుర్ అమర్నాథ్ రెడ్డి.**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల పరిధిలోని కమ్మదనం గ్రామానికి చెందిన జి. స్ఫూర్తి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. చంపాపేట్‌లోని శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఈమె, 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. కమ్మదనం గ్రామానికి చెందిన తిరుపతయ్య గౌడ్, జయమ్మ దంపతుల కుమార్తె అయిన స్ఫూర్తి, సాధారణ కుటుంబం నుంచి వచ్చి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని ఇంటి వద్ద పండుగ వాతావరణం నెలకొంది. తమ కుమార్తె కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

**అమర్నాథ్ రెడ్డి అభినందనలు:**

రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన స్ఫూర్తిని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కమ్మదనం మాజీ డిప్యూటీ సర్పంచ్ కోగుర్ అమర్నాథ్ రెడ్డి ఆదివారం విద్యార్థిని నివాసంలో కలిసి శాలువా తో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధించగలరని స్ఫూర్తి నిరూపించిందన్నారు. రానున్న రోజుల్లో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యా రంగంలో మరిన్ని గొప్ప పథకాలు, విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, వార్డు సభ్యులు శేఖర్, పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి.. సప్లిమెంటరీ పరీక్షలు ఎప్పట్నుంచంటే?



తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రథమ ఇంటర్‌లో 66.2 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4,89,123 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో ఉత్తీర్ణత శాతం 74.4 కాగా.. బాలురు ఉత్తీర్ణత శాతం 57.69గా ఉంది. ద్వితీయ ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 5,07,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,58,490 మంది (70.34శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 78.65గా ఉండగా.. బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా నమోదైంది. ప్రథమ ఇంటర్‌లో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 66.94% మంది, ఒకేషనల్‌లో 59.30% మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 75.61%, ఒకేషనల్‌లో 72.71%గా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం బాగానే ఉంది. బీసీ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 86శాతం (జనరల్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 96శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో (జనరల్) 90శాతం నమోదు కాగా.. ఒకేషనల్‌లో 98శాతంగా ఉంది. కేజీబీవీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 72శాతం, ఒకేషనల్‌లో 86శాతం ఉత్తీర్ణత కాగా.. సెకండ్ ఇయర్‌లో 82శాతం, ఒకేషనల్‌లో 94శాతంగా ఉంది. ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో (జనరల్) 77శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 65శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో 71శాతం (రెగ్యులర్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 51శాతంగా ఉంది. సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం 77.66 కాగా.. ద్వితీయ ఇంటర్‌లో 86.79శాతంగా ఉంది.

## ఏటీఎంలలో పెట్టాల్సిన రూ.1.2 కోట్ల నగదు మాయం



అమీర్‌పేట: ఏటీఎంలలో పెట్టాల్సిన నగదు భారీగా మాయమైన ఘటన హైదరాబాద్‌లోని ఎస్సార్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఏటీఎంలలో నింపాల్సిన నగదు నుంచి రూ.1.20 కోట్లకు పైగా డబ్బు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. సాధారణంగా సీఎంఎస్ సంస్థ వివిధ బ్యాంకుల నుంచి నగదును తీసుకుని ఏటీఎంలలో నింపుతుంది. ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో ఎస్సార్‌నగర్ పరిధిలోని 31 ఏటీఎంలలో తనిఖీలు చేపట్టగా.. 8 ఏటీఎంలలో భారీగా నగదు కొరత ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.1,20,98,500 నగదు లోటు ఉన్నట్లు తేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు కస్టోడియన్లపై అనుమానం వ్యక్తమవుతోంది. వారు విధులకు హాజరు కాకపోవడం.. ఫోన్ కాల్స్‌కూ స్పందించకపోవడంతో అనుమానం మరింత పెరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి.. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## ఎత్తిపోతల పథకాల పనులు వేగవంతంగా పూర్తి చేయండి: మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఎత్తిపోతల పథకాలు ఖరీఫ్ 2026 నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో సూర్యాపేట జిల్లా నీటిపారుదల అధికారులతో మంత్రి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని ఎత్తిపోతల పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం జవహర్ జనపహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం వంటి ప్రధాన పథకాల స్థితిగతులను పరిశీలించారు. 53,000 ఎకరాలకు సాగునీరు స్థిరీకరణ లక్ష్యంతో రూ. 1,642 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించారు.

# 'కూలి'పోతున్న బాల్యాన్ని కాపాడి.. బాలల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

కట్నీ (మధ్యప్రదేశ్), ఏప్రిల్ 13 : పెద్ద సంఖ్యలో చిన్నారులను అక్రమ రవాణా (Child trafficking) చేస్తున్న ముఠా గుట్టును రైల్వే పోలీసులు రట్టు చేశారు. బిహార్ (Bihar) నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 163మంది మైనర్ బాలురను మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాలో ఒక ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి రక్షించారు. ఆరు నుంచి 13 ఏళ్ల మధ్య వయసున్న ఈ పిల్లలను లాతూర్‌లో కూలి పని కోసం బిహార్ నుంచి తరలిస్తున్నట్లు బాలల సంక్షేమ కమిటీ సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వెంటనే శనివారం రాత్రి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ప్రభుత్వ రైల్వే పోలీసు దళాల సాయంతో చిన్నారులను రక్షించామన్నారు. పట్నాపూర్ణ ఎక్స్‌ప్రెస్‌లో సరైన టికెట్లు, పత్రాలు లేకుండా 163 మంది బాలురతో పాటు ప్రయాణిస్తున్న ఎనిమిది మందిని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ దళాలు కట్నీ రైల్వే స్టేషన్‌లో అడ్డగించాయని అధికారులు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. మైనర్లను కూలి పనులు చేయించడానికి లాతూర్‌కు తీసుకువెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పిల్లలను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించి.. కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు బాలల రక్షణ అధికారి మనీష్ తివారీ తెలిపారు. వారి తల్లిదండ్రులను సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.



# పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించే కుట్ర: స్టాలిన్



దిల్లీ: భారతీయ జనతా పార్టీ (BJP) నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దక్షిణాదికి ద్రోహం చేసేందుకు సిద్ధమవుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను సాకుగా చూపి పార్లమెంట్‌లో తమిళనాడు ప్రాతినిధ్యాన్ని తగ్గించడానికి కుట్ర పన్నుతోందన్నారు. దేశ వృద్ధి కోసం జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను శిక్షించాలనుకుంటోందని విమర్శించారు. రామనాథపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు మాటున పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని స్టాలిన్ ఆరోపించారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ అన్యాయాన్ని అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి వ్యతిరేకించగలరా? అంటూ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో యూనిఫామ్ సివిల్ కోడ్ తీసుకొస్తానని ప్రకటించిన భారతీయ జనతా పార్టీ.. దాన్ని తమిళనాడులో ఎందుకు సవాల్ చేయలేకపోతోందని ప్రశ్నించారు. ఎందుకంటే ద్రవిడియన్ వాల్ తమిళనాడును రక్షిస్తోందని పేర్కొన్నారు. తమిళ ప్రజలు ఎప్పటికీ మత వాదులను రాష్ట్రంలోకి అనుమతించబోరని స్టాలిన్ అన్నారు. ఈవీ రామస్వామి, అన్నాదురై, కరుణానిధి వంటి వారు పెంచి పోషించిన కోటను బద్దలు కొట్టడం అంత సులువు కాదని భాజపాకు ఈ పాటికే అర్థమైందన్నారు. అందుకే భాజపా అన్నాడీఎంకే, పళని స్వామిని ఎంపిక చేసుకుందన్నారు. భాజపాను తమిళనాడులోకి తీసుకొచ్చేందుకు పళనిస్వామి పల్లకి మోస్తున్నారంటూ స్టాలిన్ ఎద్దేవాచేశారు. భాజపా అకృత్యాలను ప్రశ్నిస్తే పళని స్వామి సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోతారని విమర్శించారు. బానిసత్వంలో ఆయన్ను మించిన వారు లేరని నిరూపించుకోవడానికే ఏప్రిల్ 23న జరగబోయే ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారని విమర్శించారు.

# సోల్జర్ టు స్కాలర్.. ఈ మాజీ సైనికుడికి 138 డిగ్రీలు



ఝున్‌ఝును (రాజస్థాన్): సైన్యంలో పనిచేసిన ఆయనకు చదువుపై మమకారం తగ్గలేదు. ఓవైపు దేశసేవ చేస్తూనే.. సెలవుల్లో సమయం దొరికినప్పుడు విద్యకే ప్రాధాన్యమిచ్చారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా అనేక డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులు చేయడంలోనే నిమగ్నమయ్యారు. మొత్తంగా ఇప్పటివరకు 138 డిగ్రీలు పూర్తి చేయడంతోపాటు అత్యధిక విద్యార్హతలు పొందిన వ్యక్తిగా జాతీయ, అంతర్జాతీయ రికార్డులు సాధించారు. ఆయనే రాజస్థాన్‌కు చెందిన దశరథ్ సింగ్. ఝున్‌ఝును జిల్లాకు చెందిన దశరథ్.. 1969లో ఓ రైతు కుటుంబంలో జన్మించారు. వారి కుటుంబంలో పెద్దగా చదువుకున్న వారెవరూ లేరు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసినప్పటికీ.. ఆర్థిక సమస్యలతో కళాశాల విద్యను పూర్తిచేయలేకపోయారు. చివరకు 1988లో సైన్యంలో చేరిన ఆయన.. పంజాబ్, జమ్మూకశ్మీర్ తదితర ప్రాంతాల్లో 16 ఏళ్లపాటు సేవలందించి 2004లో పదవీ విరమణ చేశారు. సైన్యంలో ఉన్నప్పుడు ఏడాదిలో వచ్చే రెండు నెలల సెలవులను ఉన్నత చదువుల కోసమే వినియోగించుకునేవారు. రిటైర్మెంట్ తర్వాత తన అభిరుచిపై మరింత దృష్టి పెట్టారు. తొలుత బీకామ్ డిగ్రీని పొందానని చెప్పిన ఆయన.. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ వంటి కోర్సులను రెగ్యులర్‌గా పూర్తిచేశారు. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం సహా పలు ప్రైవేటు యూనివర్సిటీల నుంచి అనేక పట్టాలు పొందారు. ఇప్పటివరకు మూడు పీహెచ్‌డీలు, ఏడు యూజీలు, 46 పీజీలు, 23 డిప్లొమాలు, ఏడు మిలటరీ విద్యకు సంబంధించిన డిగ్రీలు, వివిధ విభాగాల్లో 52 సర్టిఫికెట్ కోర్సులను దశరథ్ పూర్తిచేశారు. ఇగ్నో నుంచి వేద విభాగంలో ఇటీవల మాస్టర్స్ పూర్తి చేసిన ఆయన.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 11 ప్రపంచ రికార్డులను సాధించినట్లు పేర్కొన్నారు.




## సరిహద్దు ప్రాంతాలకు చైనా పేర్లు..
# దీటుగా స్పందించిన భారత్

న్యూఢిల్లీ: సరిహద్దు ప్రాంతాల్లోని భూభాగాలకు తప్పుడు పేర్లు పెట్టేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలపై భారత్ దీటుగా స్పందించింది. ఇటువంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణకు జరుగుతున్న ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. ''అరుణాచల్ ప్రదేశ్ సహా ఆయా ప్రదేశాలు గతంలో, ప్రస్తుతం, భవిష్యత్తులోనూ భారత్‌లో అంతర్భాగమే. తప్పుడు ఆరోపణలు చేయడం, నిరాధారమైన కథనాలు సృష్టించడం ద్వారా ఈ వాస్తవాన్ని మార్చలేరు. చైనా తీసుకుంటున్న ఈ చర్యలు.. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను స్థిరీకరించడం, సాధారణ స్థాయికి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలకు విఘాతం కలిగిస్తాయి. ఇరు దేశాల సంబంధాల్లో ప్రతికూలతను కలిగించే ఈ చర్యలకు చైనా దూరంగా ఉండాలి'' అని రణ్‌ధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు.

# సుడిగుండాల్లో చిక్కుకుపోతారు!.. అమెరికాకు ఐఆర్‌జీసీ వార్నింగ్



హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ప్రకటించడంపై ఇరాన్ సైనిక విభాగం స్పందించింది. హర్మూజ్‌లో కీలకమైన నౌకామార్గం పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేసింది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా.. ప్రాణాంతక సుడిగుండాల్లో చిక్కుకుపోతారని హెచ్చరించింది. ఈ మేరకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (IRGC) నౌకాదళ విభాగం సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసింది. అమెరికా-ఇరాన్‌ల (Iran) మధ్య శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసి విఫలమైందన్నారు. జలసంధిని వెంటనే తెరవాలని హెచ్చరించిన ఆయన.. అక్కడ ఇరాన్ దోపిడీని అడ్డుకుంటామన్నారు. ఈ క్రమంలో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించానని, త్వరలోనే ఆ పని ప్రారంభమవుతుందని చెప్పారు.

**రష్యా, ఇరాన్ అధ్యక్షుల సంభాషణ..**

మరోవైపు, పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ చర్చించుకున్నట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. ఈ సందర్భంగా అమెరికాతో జరిపిన చర్చల వివరాలను పుతిన్‌కు ఇరాన్ అధ్యక్షుడు వివరించినట్లు తెలిపింది. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు అవసరమైన సాయాన్ని చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ చెప్పినట్లు పేర్కొంది.

# మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక: బండి సంజయ్



హైదరాబాద్: మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలు బుద్ధి చెబుతారన్నారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు దశాబ్దాల నాటి కల అని, మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా బిల్లుకు మద్దతివ్వాలని బండి పిలుపునిచ్చారు. ''మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందే. డీలిమిటేషన్‌తో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. తెలంగాణ అసెంబ్లీలో 60 మంది మహిళలకు అవకాశాలు లభిస్తాయి'' అని బండి సంజయ్ అన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే 'నారీశక్తి వందన్ అధినియం'బిల్లును ప్రవేశపెట్టనున్నారు. చట్టాన్ని 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే అమలులోకి తెచ్చేలా చర్యలు చేపట్టనున్నారు.



# రామాలయ నిర్మాణం పరిపూర్ణం

అయోధ్య: రామభక్తుల చిరకాల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. అయోధ్య రాముని ఆలయ నిర్మాణం పూర్తయినట్లు శుక్రవారం నిర్మాణ కమిటీ ప్రకటించింది. దాదాపు రూ.1,800 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తి చేశామని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర ధ్రువీకరించారు. ఆలయ నిర్మాణ బాధ్యతను తమకు 2020లో లాంఛనంగా అప్పగించినా అందుకు సంబంధించిన ఏర్పాట్లు చాలా ముందు నుంచే మొదలయ్యాయని తెలిపారు. న్యాయపరమైన చిక్కుముడులు తదితర కారణాల రీత్యా ఒక దశలో ఆశలు సన్నగిల్లినా దైవ నిర్ణయంతో నిర్మాణం పూర్తయిందని చెప్పారు. తొలుత రామ్ లల్లా విగ్రహాన్ని కలపతో చేసిన చట్రం వంటి తాత్కాలిక నిర్మాణంలో స్థాపించారు. ఆ ప్రదేశాన్ని ఇప్పుడు సురక్షిత ప్రాంతంగా ప్రకటించి అందులో అఖండ జ్యోతిని ఏర్పాటు చేశారు.

# బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం!




హైదరాబాద్: బేగంపేట యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లో భారీ మోసం జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తాజాగా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వినియోగదారుడి ఖాతా నుంచి రూ.6.5కోట్లు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను విదేశాల్లో ఉన్న సమయంలో ఇదంతా జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతకం ఫోర్జరీ చేసి 42 లూజ్ లీఫ్ చెక్కులు వినియోగించారని అందులో పేర్కొన్నారు. ఈ కేసులో బ్రాంచ్ సీనియర్ అధికారులు, ఆపరేషన్స్ టీమ్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించినట్లు తెలుస్తోంది. అనుమతి లేకుండానే బ్యాంక్ ఖాతా క్లోజ్ చేశారని, సీఈవో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతోపాటు అనేక మంది బ్యాంక్ ఖాతాల నుంచి కూడా నగదు మాయమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. బ్రాంచ్ మేనేజర్ వెంకటరమణను కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.



# మీ పిల్లల ఆరోగ్యం మీ చేతుల్లోనే

మీ పిల్లలు గంటల తరబడి టీవీ చూస్తున్నారా? స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ స్క్రీన్లకు అతుక్కుపోయి ఎక్కువ సమయం గేమ్స్ ఆడుతున్నారా? తస్మాత్ జాగ్రత్త. ఏడాది పిల్లల నుంచి ఐదేళ్ల చిన్నారుల విషయంలో నిర్లక్ష్యం పనికి రాదు. అన్నం తినకుండా మారం చేస్తున్నారని వారిని బుజ్జగించేందుకు టీవీ, స్మార్ట్ ఫోన స్క్రీన్లపై వీడియోలు చూపించడం కామన్ అయిపోయింది. ఇంట్లో పిల్లలకు.. ఫోన్ స్క్రీన్ ను చూపిస్తే తప్ప తినే పరిస్థితి లేదు. లేదంటే ఏడుస్తారని, తప్పని పరిస్థితుల్లో ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ఏదోలా బుజ్జగించేందుకు ఈ విధంగా చేస్తున్నారు.



**అసలు సమస్య ఇక్కడే :**

నిజానికి ఇలా చేస్తూ పోతే పిల్లల ఆరోగ్యానికి ఎంత ముప్పు వాటిల్లుతుందో తల్లిదండ్రులు గ్రహించలేక పోతున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. టీవీ, మొబైల్, కంప్యూటర్ స్క్రీన్లను గంటల తరబడి చూస్తే.. అది పిల్లల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపిస్తుంది అనేదానిపై యూనైటెడ్ నేషన్స్ ఏజెన్సీ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఐదేళ్ల లోపు పిల్లలను రోజులో గంట కంటే ఎక్కువగా టీవీని చూడనియ్యొద్దు. వీడియోలు, కంప్యూటర్ గేమ్స్ కు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. ఏడాది కంటే తక్కువ వయస్సు శిశువులను ఎలక్ట్రానిక్ స్క్రీన్లను ఎట్టి పరిస్థితుల్లో దగ్గరగా ఉంచకూడదు. వీటి వల్ల రేడియేషన్ ప్రభావం శిశువులపై తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తోంది. ఐదేళ్ల లోపు పిల్లలను ఫిజికల్ గా యాక్టివ్ గా ఉండేలా వారితో ఆటలు ఆడించాలి.

**అధిక బరువుతో అనారోగ్యం :**

పిల్లలకు ఎలక్ట్రానిక్ స్క్రీన్లకు అలవాటు చేస్తూ పోతే అతిగా బరువు పెరిగిపోవడం, స్థూలకాయత్వం వంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా స్థూలకాయంతో బాధపడే వారి సంఖ్య భారీగా పెరిగిపోయినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అధిక బరువు ఉన్నవారిలో ఎక్కువగా అకాల మరణాల నుంచి గుండెజబ్బులు, డయాబెటీస్, హైపర్ టెన్షన్, కొన్ని రకాల క్యాన్సర్లు పుట్టుకొచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. అకాల మరణాలను అడ్డుకోవాలంటే.. చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ముగ్గురిలో ఒకరు స్థూలకాయులే :**

ఇప్పటి రోజుల్లో ముగ్గురిలో ఒకరు అధిక బరువు లేదా స్థూలకాయంతో బాధపడుతున్నారని, నలుగురిలో ఒకరు వ్యాయామం తగినంత చేయడం లేదని ఆమె చెప్పారు. ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న చిన్నారుల్లో ప్రపంచవ్యాప్తంగా 4 కోట్ల మంది చిన్నారులు అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. వీరిలో 50 శాతం మంది చిన్నారులు ఆఫ్రికాకు చెందినవారు ఉండగా.. మిగతా వారంతా ఆగ్నేయ ఆసియా ప్రాంతలోవారే ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అధిక బరువు కలిగిన పిల్లలు 5.9 శాతంగా ఉన్నట్టు బుల్ వెల్లడించారు.

**కనీసం 3 గంటలు వ్యాయామం :**

**పిల్లలకు సమయానికి కంటి నిండా నిద్రపోయేలా వాతావారణాన్ని కల్పించాలి. జీవితాంతం అదే అలవాట్లను అలవరుచుకునేలా చూడాలి. తద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే స్థూలకాయం, ఇతర వ్యాధుల నుంచి బయటపడవచ్చు. గంటల కొద్ది ఎలక్ట్రానిక్ డివైజ్ స్క్రీన్లను చూడటం వల్ల చిన్నారులపై ఎంత ప్రభావం చూపిస్తుందో నిపుణులు కొన్ని సూచనలు చేశారు. ఏడాది నుంచి నాలుగేళ్ల వయస్సు ఉన్న పిల్లలు రోజులో కనీసం మూడు గంటల పాటు వివిధ ఫిజికల్ యాక్టివిటీస్ చేయించాలని సూచించారు. ఏడాదిలోపు శిశువులతో నేలపై ఆడే ఆటలు ఆడించాలి.**



**ఈ జాగ్రత్తలు తప్పనిసరి :**

- రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలి
- తక్కువ దూరం ప్రయాణాలకు నడక ఉత్తమం
- సైక్లింగ్ అలవాటు చేయాలి
- టీవీ, కంప్యూటర్ గేమ్స్ కు తక్కువ టైం ఇవ్వాలి
- అవసరమైతే తప్ప మొబైల్ ఇవ్వకండి
- ఇంటి పనుల్లో భాగస్వామ్యం కల్పించాలి

# ఇవి లివర్‌కు ఆల్కహాల్ కంటే డేంజర్!

మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం మనం ఎన్నో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా మంచి ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం ఎంత ముఖ్యమో మన ఆరోగ్యానికి మంచిది కాని ఆహారాన్ని తినకుండా దూరం పెట్టడం కూడా అంతే ముఖ్యం. అంటే మన ఆహార అలవాట్లపైనే మన ఆరోగ్యం ఆధార పడి ఉంటుంది. మన ఆరోగ్యాన్ని పాడు చేసే అలవాట్లలో ఆల్కహాల్ తీసుకోవడం ఒకటి. అయితే మద్యం సేవించడం మాత్రమే కాదు అంతకంటే డేంజరస్ ఆహార అలవాట్లు కూడా ఉన్నాయి. మన ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఆహారాలను తీసుకుంటే మన లివర్ త్వరగా పాడైపోతుంది. ఇంతకీ ఆల్కహాల్ కన్నా ప్రమాదకరమైన ఆ ఆహారాలు ఏమిటి అనేది తెలుసుకుందాం.



**తెలియకుండానే తినేస్తున్నాం..**

ఆల్కహాల్ ఎక్కువగా తీసుకుంటే కాలేయం దెబ్బతింటుంది అనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసు. అయితే ఆల్కహాల్ తీసుకున్న దానికంటే కూడా కాలేయానికి చేటు చేసే ఆహారాలు చాలా ఉన్నాయి. మనకు తెలియకుండానే ఆ ఆహారాలను మనం తింటూ ఉంటాం. ఇక అటువంటి ఆహారాల్లో ఫ్రెంచ్ ఫ్రైస్ ఒకటి. బంగాళదుంపలను పొడవుగా కట్ చేసి వాటిని మరిగించిన నూనెలో ఫ్రై చేసే ఫ్రెంచ్ ఫ్రైస్ తో ఆరోగ్యానికి చాలా అనర్థం జరుగుతుంది.

**ఎలా పడితే అలా వద్దు..**

మనలో చాలా మంది మాంసాన్ని తింటారు. కానీ దాన్ని మామూలు కూరలో వండుకుంటే పర్వాలేదు. కానీ ఫ్రైడ్ చికెన్ లాంటి ప్రయోగాలు చేసి తింటే మన ఆరోగ్యం పాడైపోతుంది. ముఖ్యంగా దీని ప్రభావం లివర్ పైనే పడుతుంది. ఫ్రైడ్ చికెన్ కూడా విపరీతమైన నూనెలోనే వేయిస్తారు. అతిగా నూనెలో ఫ్రై చేయడం వల్ల ఇది కాలేయం పైన తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. ఇక మన ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేవాటిలో రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి.

**అధిక కొవ్వుతో ఎఫెక్ట్...**

రెడ్ మీట్ , ప్రాసెస్ చేసిన మాంసాన్ని ఎక్కువగా తినడం వల్ల కూడా అందులో అధిక మొత్తంలో ఉండే కొవ్వు కాలేయాన్ని దెబ్బతీస్తుంది. ఇది మాత్రమే కాదు ఫాస్ట్ ఫుడ్ లోను, నిల్వ చేసిన సూప్ లు, ప్రాసెస్ చేసిన మాంసం వంటి వాటిలోనూ సోడియం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కాలేయానికి ముప్పు వాటిల్లుతుంది.

**మితంగా తీసుకోవడమే ఉత్తమం...**

మనలో చాలా మంది స్వీట్లు ఎడాపెడా తినేస్తుంటారు. ఇక కూల్ డ్రింక్స్ అంటే అందరికీ ఇష్టమే. వీటి వల్ల ఫ్యాటీ లివర్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్యాక్ చేసిన స్నాక్స్, ప్రాసెస్ చేసిన ఆహారం ఏదైనా సరే కాలేయానికి హాని చేస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. వాటిని తినకుండా ఉండడానికే చూడాలి. ఒక వేళ తిన్నా ఎంత మితంగా తీసుకుంటే అంత మంచిది. ఈ ఆహారాలన్నీ మన లివర్ కు ఆల్కహాల్ కంటే డేంజర్.. వీటిని ఎక్కువగా తిని అనవసరమైన అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇలా చేసి ఒత్తిడికి చెక్ పెట్టేయండి

ఈ కాలంలో స్కూల్ పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ప్రతి ఒక్కరికి ఒత్తిడి కామన్ అయిపోయింది. చదువులు, ఉద్యోగాలు, కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఇలా పలు కారణాలతో తమలో తామే కుమిలిపోతున్నారు. కొంత మంది ఇంటి బడ్జెట్, పనులు, పిల్లలు, బంధువుల కారణంగానూ తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారు. సామాన్యుల దగ్గరి నుంచి విద్యార్థులు, మేధావులు, అధికారులు, కార్పొరేట్ దిగ్గజాల వరకూ అంతా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. దీంతో ఆందోళన, కుంగుబాటు, గుండెజబ్బులు, స్ట్రోక్ వంటి మానసిక, శారీరక సమస్యలెన్నో చుట్టుముడుతున్నాయి. మనిషిని మానసికంగా కృంగదీసే ఈ ఒత్తిడిని తగ్గించుకొని, సంతోషంగా ఎలా ఉండాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోండి.

**తరచూ వ్యాయామం..**

ఒత్తిడి స్థాయిలను తగ్గించే ఉత్తమ మార్గాల్లో వ్యాయామం ఒకటని నిపుణులు చెబుతున్నారు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే.. ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది, ఈ హార్మోన్ మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. వ్యాయామం ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ వ్యాయామం చేస్తే.. శరీరం, మనస్సు విశ్రాంతి స్థితికి వెళ్తాయి.

**ప్రశాంతమైన నిద్ర..**

ఒత్తిడిని కంట్రోల్‌లో ఉంచుకోవడానికి.. ప్రశాంతమైన నిద్ర చాలా అవసరం. నిద్ర సరిగ్గా లేకపోతే.. మనకు చిరాకు, అలసట, ఆందోళనగా అనిపిస్తుంది. నిద్ర లేకపోవడం వల్ల కార్టిసాల్ స్థాయిలు కూడా పెరుగుతాయి. ఇది ఒత్తిడిని పెంచుతుంది. నిద్ర లేమికి దారి తీస్తుంది. నిద్ర చాలా ముఖ్యం, అందులోనూ రాత్రి నిద్ర మరింత ముఖ్యం. ప్రతి రోజు తప్పకుండా రాత్రి పూట కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**శ్వాస వ్యాయామాలతో మేలు..**


ఒత్తిడిగా ఫీల్ అయినప్పుడు శ్వాస వ్యాయామాలు ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. డైలీ శ్వాస వ్యాయామాలు ప్రాక్టీస్ చేస్తే ప్రశాంతంగా ఉండవచ్చట. మీ శ్వాసపై దృష్టి పెడుతూ.. డీప్ బ్రీత్ ఎక్స్‌ర్‌సైజ్‌లు ప్రాక్టీస్ చేస్తే.. మీ మనస్సుకు విశ్రాంతి లభిస్తుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. రోజుకు కనీసం పది నిమిషాలు డీప్ బ్రీత్ ఎక్స్‌ర్‌సైజ్‌లు ప్రాక్టీస్ చేస్తే.. ఒత్తిడి తగ్గుతుంది.

**పోషకాహారమూ ముఖ్యమే...**

మన శరీరం సక్రమంగా పని చేయడానికి సమతుల్య, పోషకాహారం చాలా ముఖ్యం. ఒత్తిడిని కంట్రోల్‌లో ఉంచడానికి.. పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. మీ డైట్‌లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్ వంటి వివిధ రకాల సంపూర్ణ ఆహారాలను తీసుకుంటే మంచిది. ప్రాసెస్ చేసిన ఫుడ్స్, చక్కెర, కూల్ డ్రింక్స్ వంటి ఆహారాలకు దూరంగా ఉండాలి.

**ఇష్టమైనవారితో మాట్లాడండి..**

ఒత్తిడిని తగ్గించడానికి.. పక్క వాళ్ల సహకారం కూడా ఎంతో బాగా పని చేస్తుంది. భావోద్వేగ మద్దతును అందించడానికి, ఒంటరితనం దూరం చేయడానికి.. స్నేహితులు, ఇష్టమైన వారితో ఎక్కువ సమయం గడపండి. మన మనసులో ఉన్న ప్రతి విషయం ఇష్టమైన వారితో చెప్పుకుంటే కాస్త భారం దిగిపోతుంది. అంతే కాకుండా అవతల వ్యక్తి మాటలు మనకు ఒత్తిడిని తగ్గిస్తాయి.



# టీసీఎస్‌లో కొలువుల జాతర..

## ఈ ఏడాది 25,000 మందికి అవకాశం




**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఐటీ రంగంలో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. అనేక సంస్థలు వేలాది మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. అయితే, టీసీఎస్ మాత్రం ఉద్యోగుల్ని నియమించుకునే పనిలో ఉంది. ఐటీ సేవలు అందిస్తున్న ఇండియన్ కంపెనీ టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్). 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ 25,000 మంది ఫ్రెషర్స్‌కు అవకాశం కల్పించనుంది.

సంస్థ సీఈవో, ఎండీ కే క్రితివాసన్ దీనికి సంబంధించిన వివరాల్ని వెల్లడించారు. డిమాండ్‌కు అనుగుణంగా కాలేజ్ గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసుకుంటామని తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. ఒకపక్క ఐటీ కంపెనీలకు అవరోధాలు ఎదురవుతున్నా గత ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ మాత్రం 44,000 మంది ఫ్రెషర్లను నియమించుకుంది. దేశంలో గత ఏడాది అత్యధిక నియామకాలు చేపట్టిన ప్రైవేటు కంపెనీగా కూడా నిలిచింది. కొత్తగా ఎంపికైన ఫ్రెషర్లు పూర్తిస్థాయిలో ఉద్యోగంలో చేరేందుకు తొమ్మిది నెలలు పడుతుంది. 9 నెలల శిక్షణ అనంతరం ఉద్యోగులకు ప్రాజెక్టులు అప్పగిస్తారు. ఇదే సమయంలో 12,000 మందిని తొలగించింది. అయితే, ఉద్యోగుల్ని తొలగించేందుకు ఏఐ కారణం కాదని సీఈవో కే క్రితివాసన్ చెప్పారు. కంపెనీలో బాగా పనిచేసినంత కాలం తొలగింపు ఉండదని ఆయన అన్నారు.

సీనియర్ లెవల్ ఉద్యోగుల్ని ఎక్కువగా తొలగించినట్లు చెప్పారు. మరోవైపు టీసీఎస్‌లో ఉద్యోగులకు భారీ స్థాయిలో వేతనాలు పెరగబోతున్నట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టీసీఎస్‌కు 40 బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్ దక్కినట్లు తెలుస్తోంది. ఇటీవల నాసిక్ టీసీఎస్‌లో మహిళా ఉద్యోగులపై వేధింపులు వంటి అంశాలతో ఈ సంస్థ వార్తల్లో నిలుస్తోంది.

# సెంట్రల్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలు..

## నెలకు రూ.లక్ష వరకు వేతనం




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. వివిధ విభాగాల్లో 26 స్పెషలిస్ట్ ఆఫీసర్ (ఎస్ఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ స్పెషలైజ్డ్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.60,000 నుంచి రూ.1,00,000 వరకు జీతం ఉంటుంది.

అర్హతల విషయానికి వస్తే.. సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్, బీఎస్సీ, ఎంబీఏ లేదా సీఏ పూర్తి చేసి, 3 నుంచి 5 ఏళ్ల పని అనుభవం ఉండాలి. అభ్యర్థుల వయసు 20 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షకు 70 శాతం, ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.175, మిగతా వర్గాల వారు రూ.850 చెల్లించాల్సి ఉంటుంది. 2026 ఏప్రిల్ 30 దరఖాస్తులకు చివరి తేదీ. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# పసిడిని కేంద్రబ్యాంకులు కొంటూనే ఉన్నాయ్

## ఫిబ్రవరిలో నికరంగా 19 టన్నులు



**న్యూఢిల్లీ:** పసిడి ధర పరుగులు పెట్టడానికి, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో పసిడి నిల్వలు పెంచుకోవడమూ ఒక కారణమన్నది తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు నికరంగా 19 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయని ప్రపంచ స్వర్ణమండలి (డబ్ల్యూజీసీ) తెలిపింది.

కొనుగోలుదార్లు-విక్రయదార్ల వివరాలు: పోలండ్ 20 టన్నులు, ఉజ్బెకిస్థాన్ 8, చెక్ రిపబ్లిక్ 2, మలేషియా 2, చైనా - కాంబోడియా 1 టన్ను చొప్పున కొనుగోలు చేయగా, టర్కీ 8 టన్నులు, రష్యా 6 టన్నుల చొప్పున పసిడిని విక్రయించాయి.

2025 ఫిబ్రవరిలో 29 టన్నులు కొనుగోలు చేసిన పోలండ్ కేంద్రబ్యాంక్ మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ రికార్డుస్థాయిలో పసిడిని పోగుచేసుకుంది. మొత్తం బంగారం నిల్వలను 700 టన్నులు చేయాలన్నది ఈ బ్యాంక్ లక్ష్యం కాగా, ఇప్పటికి 570 టన్నులు చేసింది. చైనా విదేశీ మారకపు నిల్వల్లో బంగారం వాటా 10%. ఈ దేశ కేంద్రబ్యాంక్ వద్ద మొత్తం 2,308 టన్నుల బంగారం ఉంది. బంగారాన్ని కొనుగోలు చేయడం చెక్ రిపబ్లిక్‌కు వరుసగా ఇది 36వ నెల కాగా, చైనాకు 16వ నెల, ఉజ్బెకిస్థాన్‌కు 5వ నెల.

# లక్నో గడ్డపై దంచేసిన గిల్, బట్లర్..

## గుజరాత్‌కు రెండో విజయం..!




**లక్నో:** పంతొమ్మిదో సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ వరసగా రెండో విజయం సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) త్వరగా ఔటైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను సులువుగా ఎదుర్కొన్న జోస్ బట్లర్(60), గిల్ గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపారు. రెండో వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయం వెంటవెంటనే ఔటైనా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. ఏడు వికెట్లతో గెలుపొందిన గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

సొంత మైదానంలో పంజా విసరాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు భారీ షాకిచ్చింది గుజరాత్ టైటాన్స్. తొలుత ప్రసిధ్ కృష్ణ సంచలన స్పెల్‌తో లక్నోను 164కే కట్టడి చేసిన గుజరాత్ మోస్తరు లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(15) విఫలమైనా శుభ్‌మన్ గిల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వని గిల్.. జోస్ బట్లర్(60) స్కోర్ బోర్డును ఉరికించారు. గిల్ కళాత్మక షాట్లతో అలరించగా.. బట్లర్ స్కూప్, రివర్స్ స్వీప్ షాట్లతో చెలరేగాడు. రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించిన గిల్‌ను ప్రిన్స్ యాదవ్ వెనక్కి పంపాడు. కాసేపటికే షమీ ఓవర్లో బట్లర్ సిక్సర్‌కు యత్నించి బౌండరీ వద్ద మర్క్‌రమ్ స్టన్నింగ్ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. వెంట వెంటనే రెండు వికెట్లు పడినా.. వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి రాహుల్ తెవాటియా(10 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. ప్రిన్స్ ఓవర్లో 4, 6 బాదిన సుందర్ లాంఛనం పూర్తి చేశాడు. దాంతో.. వరసగా సన్‌రైజర్స్, కోల్‌కతాపై గెలుపొందిన లక్నోకు ఓటమి తప్పలేదు.

### ప్రసిధ్ దెబ్బకు విలవిల

పంతొమ్మిదో సీజన్‌లో హ్యాట్రిక్ కొట్టాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ మోస్తర్ స్కోర్‌కే పరిమితమైంది. సొంత మైదానంలో చెలరేగిపోవాలనుకున్న లక్నో జట్టుకు గుజరాత్ టైటన్స్ పేసర్ ప్రసిధ్ కృష్ణ(4-28) షాకిచ్చాడు. పవర్ ప్లేలోనే కగిసో రబడ(1-54), ప్రసిధ్ ధాటికి రెండు వికెట్లు కోల్పోయిన లక్నో ఏ దశలోనూ పుంజుకోలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన గుజరాత్ పేసర్లు లక్నో హిట్టర్లకు బ్యాట్ ఝులిపించే అవకాశమివ్వలేదు.

### ప్రసిధ్ కృష్ణ(4-28)

ప్రసిధ్ ధాటికి 69కే మూడు వికెట్లు పడిన వేళ పవర్ హిట్టర్ ఆయుశ్ బదొని(9), నికోలస్ పూరన్(19)లు లక్నోను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, ఈ ఇద్దరి సైతం వెనక్కి పంపిన ప్రసిధ్ స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు. కుర్రాళ్లు అబ్దుల్ సమద్(18), ముకుల్ చౌదరీ(18) మెరవగా.. ఆఖర్లో ఇంప్యాక్ట్ సబ్ జార్జ్ లిండే(16)ధనాధన్ ఆడడంతో ఆ జట్టు 160 పరుగులు చేయగలిగింది. ఆఖరి ఓవర్లో షమీ(12 నాటౌట్) సిక్సర్ బాదడంతో లక్నో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేయగలిగింది.

# ఆశా భోంస్లేకు క్రికెటర్ల నివాళి..

## నిశబ్దంగా వాంఖడే స్టేడియం..!

**వాంఖడే:** ప్రముఖ గాయని ఆశా భోంస్లేకు క్రికెటర్లు నివాళులు అర్పించారు. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాళ్లు వాంఖడే స్టేడియంలో దివంగత గాయని మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఇరుజట్ల సహాయక సిబ్బంది, అంపైర్లు, మైదానంలోని అభిమానులు సైతం లేచి నిల్చొని దిగ్గజ సింగర్‌కు నివాళులు అర్పించారు.

వాంఖడేలో మ్యాచ్ ప్రారంభానికి ముందు ముంబై, ఆర్సీబీ ఆటగాళ్లు ఆశా భోంస్లేకు నివాళులు అర్పించారు. ఇరుజట్ల క్రికెటర్లు, సహాయక సిబ్బంది, అంపైర్లు, ప్రేక్షకులు అందరూ ఒక నిమిషం మౌనం పాటించి లెజెండరీ సింగర్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

### శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు

భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో ఒక ధ్రువతారగా వెలిగిన ఆశా భోంస్లే ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఊపిరితిత్తులు, హృదయ సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చేరిన ఆమెను బతికేంచేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. కుమారుడు ఆనంద్ భోంస్లే ఆమె మరణ వార్తను వెల్లడించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి ఆమె పార్థివ దేహాన్ని చూసేందుకు అభిమానులకు అనుమతిస్తామని, సాయంత్రం 4



గంటలకు శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆనంద్ భోంస్లే పేర్కొన్నారు.

బాలీవుడ్‌లో నేపథ్య గాయనిగా తన ముద్ర వేసిన ఆశా భోంస్లే ప్రస్థానం అద్భుతంగా సాగింది. మహారాష్ట్రలోని సాంగ్లీలో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు ఆశ. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు దీనానాథ్ మంగేష్కర్ వారసురాలిగా చిన్నతనంలోనే సంగీత ఓనమాలు నేర్చుకున్నారు. తన 10వ ఏటనే (1943) 'మాఝా బల్' అనే మరాఠీ చిత్రం ద్వారా గాయనిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె 1948లో 'చునరియా' చిత్రంలోని "సావన్ ఆయా" పాటతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టారు.

### అవార్డులు..

తన సుమధుర గాత్రంతో కోట్లాది మంది మనసులు గెలిచిన ఆశా భోంస్లే 20కి పైగా భారతీయ, విదేశీ భాషల్లో సుమారు 12,000కు పైగా పాటలు ఆలపించారు. అత్యధిక స్టూడియో రికార్డింగ్స్ చేసిన గాయనిగా 2011లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. భారత ప్రభుత్వం ఆమెను 2000లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో, 2008లో పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించింది.

# ఆఖరి మెట్టుపై తడబడినా.. రజతంతో చరిత్ర సృష్టించిన ఆయుశ్..!

**చైనా:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి ఆఖరి మెట్టుపై తడబడ్డాడు. అదిరే ఆటతో ఫైనల్ చేరిన ఆయుష్ స్వర్ణానికి బదులు రజతంతోనే సరిపెట్టుకున్నాడు. ఆదివారం మెడల్ సాధించాడు. సెమీస్‌లో టాప్ సీడ్‌ను ఓడించిన ఈ కుర్రాడు ఫైనల్లో మాత్రం తేలిపోయాడు. వరస సెట్లలో షీ యూ కీ(చైనా) జోరు ముందు తలవంచిన ఆయుశ్ మ్యాచ్‌ను అప్పగించేశాడు.




జరిగిన పురుషుల సింగిల్స్ టైటిల్ పోరులో భారత కుర్రాడి జైత్రయాత్రకు చైనా ఆటగాడు షీ యూ కీ చెక్ పెట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన షీ వరస సెట్లలో జోరు చూపించి విజేతగా నిలిచాడు.

చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆయుష్ శెట్టి సిల్వర్

తొలి సెట్‌ను 8-21తో కోల్పోయిన భారత షట్లర్ రెండో సెట్‌లోనూ పుంజుకోలేదు. 21-10తో గెలుపొందిన షీ పసిడి పతకాన్ని ఎగరేసుకుపోయాడు. 61 ఏళ్ల తర్వాత ఈ లీగ్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆడిన తొలి భారతీయుడిగా చరిత్రకెక్కిన ఆయుష్ రజతంతో సగర్వంగా స్వదేశానికి రానున్నాడు.

# సాల్ట్ 'పవర్'.. పాటిదార్ 'స్పీడ్'.. కోహ్లి 'క్లాస్'..

## వాంఖడేలో ఆర్‌సీబీ విధ్వంసం!

## ముంబయి ఇండియన్స్‌పై ఆర్సీబీ విజయం

**ముంబయి:** ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో ఆర్సీబీ విజయం సాధించింది. టాస్ ఓడి.. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 240 పరుగులు చేసింది. 241 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 222 పరుగులకే పరిమితమైంది.

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగినమ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. టాస్ గెలిచిన ముంబై బౌలింగ్ ఎంచుకోగా..

ఆ నిర్ణయం తప్పని నిరూపిస్తూ ఆర్‌సీబీ ఓపెనర్లు వారి జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ హై-వోల్టేజ్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పరుగుల వరద పారించింది. ఫిలిప్ సాల్ట్, రజత్ పాటిదార్ మెరుపు దాడికి తోడు చివర్లో టిమ్ డేవిడ్ సిక్సర్లతో విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆర్‌సీబీ 3 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోరు సాధించింది.

### సాల్ట్ మెరుపులు.. కోహ్లి క్లాస్

ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ కేవలం 36 బంతుల్లోనే 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 78 పరుగులు చేసి ముంబై బౌలర్లను వణికించాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (38 బంతుల్లో 50) ఆరంభంలో నెమ్మదిగా ఆడినా, కీలకమైన అర్ధశతకంతో




ఇన్నింగ్స్‌కు వెన్నుముకగా నిలిచాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 115 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సాల్ట్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ విధ్వంసం సృష్టించాడు. కేవలం 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న పాటిదార్, మొత్తంగా 20 బంతుల్లో 53 పరుగులు (4 ఫోర్లు, 5 సిక్సర్లు) చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో టిమ్ డేవిడ్ (14 బంతుల్లో 34 నాటౌట్) ఆఖరి బంతిని సిక్సర్‌గా మలిచి ఇన్నింగ్స్‌ను ఘనంగా ముగించాడు. దీంతో ఆర్‌సీబీ సరిగ్గా 240 పరుగులు చేసింది.

### ముంబై బౌలర్లు విలవిల..

ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 4 ఓవర్లలో 45 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా.. హార్దిక్ పాండ్యా, శార్దూల్ ఠాకూర్ చెరో వికెట్ పడగొట్టారు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా (4 ఓవర్లలో 36 పరుగులు) ఈ మ్యాచ్‌లోనూ వికెట్ తీయలేకపోయాడు. గత 5 మ్యాచ్‌లుగా బుమ్రా వికెట్ తీయకపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ గెలవాలంటే 20 ఓవర్లలో 241 పరుగులు చేయాలి. వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో చేజింగ్ ఆసక్తికరంగా మారింది.

MOVIE TIME

# దివికేగిన లెజెండరీ గాయని 'ఆశా భోంస్లే'

# Asha Bhosle



## బాలీవుడ్‌లో విషాదం..

## దిగ్గజ గాయని ఆశా భోంస్లే మృతి

టాకీస్: భారతీయ సంగీత ప్రపంచంలో ఒక అద్భుత స్వర శకం ముగిసింది. దిగ్గజ గాయని, పద్మ విభూషణ్ గ్రహీత ఆశా భోంస్లే (92) ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. శనివారం సాయంత్రం తీవ్రమైన అలసట, ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆమె, పరిస్థితి విషమించడంతో ఐసీయూలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తొలుత ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వార్తలు వచ్చినప్పటికీ, ఆదివారం మధ్యాహ్నం ఆమె కుమారుడు ఆనంద్ భోంస్లే మరణవార్తను అధికారికంగా ధృవీకరించారు.
ఎనిమిది దశాబ్దాల పాటు 20కి పైగా భాషల్లో వేల పాటలతో కోట్లాది మందిని అలరించిన ఆమె మరణంతో బాలీవుడ్ సహా భారతీయ చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, భారతరత్న లతా మంగేష్కర్ సోదరి అయిన ఆశా భోంస్లే అంతిమ సంస్కారాలు సోమవారం ముంబైలోని శివాజీ పార్క్‌లో పూర్తి ప్రభుత్వ అధికారాలతో నిర్వహించనున్నారు.
ఆమె మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేస్తూ, సంగీత ప్రపంచం ఒక ధ్రువతారను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ వరకు.. ఆశా భోంస్లే సంగీత ప్రస్థానం!
భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో ఒక అద్భుత స్వర శకం ముగిసింది. ఎనిమిది దశాబ్దాల పాటు తన గాత్రంతో కోట్లాది మందిని ఉర్రూతలూగించిన దిగ్గజ గాయని ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూసింది. శనివారం సాయంత్రం తీవ్రమైన అలసట, ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆమె, పరిస్థితి విషమించడంతో ఐసీయూలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆశా మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమెకి సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు.

### ఆశా భోంస్లే సంగీత ప్రస్థానం

భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో ఒక ధ్రువతారగా వెలిగిన ఆశా భోంస్లే ప్రస్థానం అద్భుతంగా సాగింది. 1933 సెప్టెంబర్ 8న మహారాష్ట్రలోని సాంగ్లీలో జన్మించిన ఆమె, ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు దీనానాథ్ మంగేష్కర్ వారసురాలిగా చిన్నతనంలోనే సంగీత ఓనమాలు నేర్చుకున్నారు. తండ్రి మరణం తర్వాత కుటుంబ భారమై తన 10వ ఏటనే (1943) 'మాఝా బల్' అనే మరాఠీ చిత్రం ద్వారా గాయనిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి, 1948లో 'చునరియా' చిత్రంలోని "సావన్ ఆయా" పాటతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టారు.
సమకాలీన గాయనులందరిలోనూ ఆశా భోంస్లేది ఒక విలక్షణమైన శైలి. కేవలం మెలోడీలకు మాత్రమే పరిమితం కాకుండా, ఆధునిక సంగీతానికి ఆమె గొంతు కొత్త ప్రాణం పోసింది. ముఖ్యంగా సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్‌తో ఆమె చేసిన ప్రయోగాలు విప్లవాత్మకమైనవి. "దమ్ మారో దమ్", "పియా తూ అబ్ తో ఆజా" వంటి సాంగ్స్‌తో ఆమె పాప్ ఐకాన్‌గా ఎదిగారు. అదే సమయంలో 'ఉమ్రావ్ జాన్' చిత్రంలో ఆమె పాడిన గజల్స్ విన్నవారు, ఈమె గొంతులో ఇంతటి శాస్త్రీయ పరిణతి ఉందా అని ఆశ్చర్యపోయారు. ఆ చిత్రానికి ఆమె తొలి జాతీయ అవార్డును కూడా అందుకున్నారు. 90ల కాలంలో ఏఆర్ రెహమాన్ సంగీతంలో 'రంగీలా' వంటి చిత్రాల్లో పాటలు పాడి, ఆ తరం కుర్రకారును సైతం ఉర్రూతలూగించారు.
ఆమె రికార్డుల విషయానికొస్తే.. 20కి పైగా భారతీయ మరియు విదేశీ భాషల్లో సుమారు 12,000కు పైగా పాటలు పాడి, అత్యధిక స్టూడియో రికార్డింగ్స్ చేసిన గాయనిగా 2011లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. భారత ప్రభుత్వం ఆమెను 2000లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో, 2008లో పద్మ విభూషణ్‌తో గౌరవించింది. తెలుగు సినీ రంగంలోను ఆమెకు విడదీయరాని అనుబంధం ఉంది. చంటిలో ఓ ప్రేమ, చందమామ సినిమాలోని నాలో ఊసులకు నాలో ఊహలకు అనే పాటలతో తెలుగు ప్రేక్షకుల మనసును కూడా దోచుకుంది.

### దమ్ మారో దమ్.. కిక్కెక్కించిన ఆశా భోంస్లే..



ఆశా భోంస్లే.. పాడిన దమ్ మారో దమ్ సాంగ్ ఓ సూపర్‌హిట్. హిప్ కల్చర్‌ను ప్రజెంట్ చేసిన సాంగ్ అది. ఆ రోజుల్లో ఈ పాట ఓ బంపర్ హిట్. డ్రగ్ కల్చర్‌ను.. ఆ నాటికి తగ్గ రీతిలో ఈ ఫిల్మ్‌లో చూపించారు. 1971లో రిలీజైన హరే కృష్ణ హరే రామ్ చిత్రంలో ఓ సన్నివేశంలో దమ్ మారో దమ్ సాంగ్ వస్తుంది. జీనత్ అమన్ పాత్ర ఈ సాంగ్ పాడుతుంది. ఆర్డీ బర్మన్ అందించిన సంగీతం ఓ హైలెట్. పాశ్చాత్య సంప్రదాయం వైపు మొగ్గ చూపుతున్న యువతను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఆ సాంగ్ సీక్వెన్స్‌ను రూపొందించారు. వాస్తవానికి ఫిల్మ్‌లో ఈ పాట ముందు అనుకోలేదు. కానీ డ్రగ్ సీన్‌ను క్రియేట్ చేసే సమయంలో దాన్ని మరింత ఎఫెక్ట్‌గా ప్రజెంట్ చేయాలనుకున్నారు. ఆ సమయంలో రైటర్ ఆనంద్ భక్షీ రాసిన కొన్ని పదాలు సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్‌ను ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఈ పాట కట్టేశారు. ఆ నాటి హిప్పీ కల్చర్‌లో ఉన్న మజాను.. సింగర్ ఆశా భోంస్లే తన వాయిస్‌లో వినిపించారు. మత్తులో చిత్తై తూగుతున్నట్లుగా ఆమె తన స్వరాన్ని పలికించారు. డ్రగ్ బానిసల భావోద్వేగాన్ని ఆశా భోంస్లే తన వాయిస్ రూపంలో అత్యద్భుతంగా పలికించారు. నేపాల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాటను షూట్ చేశారు. సినిమాను రిలీజ్ చేస్తున్న సమయంలో ఓ దశలో నిర్మాత దేవానంద్ ఈ పాటను సినిమా నుంచి తీసివేయాలనుకున్నారు. కానీ ఈ సాంగ్ హిట్ అవుతుందని ఆశా భోంస్లే చెప్పడం వల్లే దాన్ని ఫిల్మ్‌లో క్యారీ చేసినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు.
బాలీవుడ్‌తో పాటు యావత్ ఫిల్మ్ ఇండస్ట్రీనే ఈ సాంగ్ కిక్కెక్కించిందనడంలో సందేహం లేదు. దమ్ మారో దమ్.. అంటూనే హరే కృష్ణ హరే రామ్ అన్న పదాలను వాడడం పట్ల విమర్శలు వచ్చినా.. మ్యూజిక్ టీమ్ అనుకున్నట్లు ఈ సాంగ్ ఫుల్ పాపులర్ అయ్యింది. కానీ ఆల్ ఇండియా రేడియోతో పాటు దూరదర్శన్‌లోనూ ఈ పాటపై బ్యాన్ విధించారు. హరే కృష్ణ హరే రామ్ చిత్రాన్ని దూరదర్శన్‌లో ప్రదర్శించిన ప్రతిసారి ఈ పాటను కట్ చేశారు. తాజాగా రిలీజైన సూపర్‌హిట్ మూవీ ధురంధర్2లో ఈసాంగ్‌ను ఓ సీన్‌లో సౌండ్‌ట్రాక్‌గా వాడారు. సోషల్ మీడియాలోనూ ఈ ట్రాక్ ఊపేస్తోంది.

### ఆమెతో జరిపిన సంభాషణలు

## ఎప్పటికీ గుర్తుంచుకుంటా: మోదీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ తన సంతాప సందేశంలో ఆశా భోస్లేను భారతదేశపు అత్యంత బహుముఖ గాయనీమణులలో ఒకరుగా కొనియాడారు. ఆమె స్వరం కాలాతీతమైనది. భారతీయ సంస్కృతికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయాలు అంటూ ఆయన నివాళు లర్పించారు. సోషల్ మీడియా ద్వారా ఆమెతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ సానుభూతి తెలిపారు .ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె స్వరం ప్రజల జీవితాల్లో నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది అంటూ పలువురు ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు.
ఇక 1933లో మంగేష్కర్ కుటుంబంలో జన్మించిన ఆశా భోస్లే, చిన్న వయస్సులోనే సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు నిరంతరాయంగా సాగిన ఆమె గాన ప్రయాణం భారతీయ సంగీత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచింది. 20కి పైగా భాషల్లో 12 వేలకుపైగా పాటలు పాడి, ప్రపంచంలోనే అత్యధిక పాటలు రికార్డ్ చేసిన గాయనిగా గుర్తింపు పొందారు.
ఆమె గాన వైవిధ్యం అసాధారణం. మెలోడీ పాటలు, ఉత్సాహభరితమైన డ్యాన్స్ నంబర్స్, గజల్స్, భజనలు ఏ జానర్ అయినా ఆమె స్వరంలో ప్రత్యేక మాధుర్యం కనిపించేది. ముఖ్యంగా ఉమ్రావ్ జాన్, ఇజాజత్ వంటి చిత్రాల్లో ఆమె ఆలపించిన గజల్స్ సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. ఆమె సోదరి, గానకోకిల లతా మంగేష్కర్ తర్వాత భారతీయ సంగీత సామ్రాజ్యంలో అదే స్థాయి గౌరవాన్ని పొందిన గాయని ఆశా భోస్లే. సంగీత రంగానికి చేసిన అపార సేవలకు గాను భారత



ప్రభుత్వం ఆమెను 'పద్మ విభూషణ్', 'దాదాసాహెబ్ ఫాల్కే' వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో సత్కరించింది. అలాగే రెండు జాతీయ అవార్డులు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఆమె మరణంతో టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాదు.. అంతర్జాతీయ సంగీత ప్రపంచం కూడా శోకసంద్రంలో మునిగిపోయింది. పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, అభిమానులు సోషల్ మీడియాలో ఆమె పాటలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పిస్తున్నారు.


## కర్మస్థలం నయా లుక్ వైరల్



టాకీస్: తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ అరవింద్ కృష్ణ. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఈ టాలెంటెడ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న మరో చిత్రం కర్మ స్థలం. రాకీ షెర్మాన్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో రాకీ షెర్మాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ మూవీ నుంచి మేకర్స్ నయా పోస్టర్ విడుదల చేశారు.
తాజాగా అరవింద్ కృష్ణ రోల్‌కు సంబంధించిన లుక్ రిలీజ్ చేయగా.. ఇందులో ఓ యోధుడిగా కనిపించబోతున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఒక్కో పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ రేకెత్తిస్తోంది.
ఈ మూవీలో చుంకీపాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి. కాలకేయ ప్రభాకర్, వెంకటేశ్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేశ్, నాగ మహాశ్, వినోద్ అల్వ, మిథాలీ చౌహాన్, కిల్లి క్రాంతి ఇతక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీకి విజువల్స్‌తోపాటు బీజీఎం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలువబోతున్నట్టు తాజా లుక్ హింట్ ఇచ్చేస్తుంది.

## 'ధురంధర్ 2' నుంచి 'డెస్టినీ–మన్ అత్కేయా'

### ఫుల్ వీడియో సాంగ్ విడుదల




టాకీస్: ప్రముఖ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు దాదాపు రూ.1700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది ఈ చిత్రం. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలోని 'డెస్టినీ -- మన్ అత్కేయా' అనే పాటకు సంబంధించిన ఫుల్ వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.
శాశ్వత్ సచ్‌దేవ్ స్వరపరిచిన ఈ గీతం ఆధునిక ర్యాప్ మరియు సాంప్రదాయ సూఫీ సంగీతాల అద్భుత కలయికగా నిలిచింది. వైభవ్ గుప్తా, షాజాద్ అలీ, మరియు టోకెన్ తమ గాత్రంతో ఈ పాటకు ప్రాణం పోశారు. ముఖ్యంగా అండర్ కవర్ ఏజెంట్‌గా రణవీర్ సింగ్ పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు స్ఫూర్తినిచ్చే లిరిక్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.